
మహేశ్‌బాబు

## ఇంకో రెండురోజుల్లో అద్భుతమైన వార్త

మహేశ్‌బాబు, త్రివిక్రమ్‌ల 'గుంటూరుకారం' సినిమా కోసం అభిమానులే కాదు, హీరోలు కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. రీసెంట్‌గా హీరో నితిన్.. 'గుంటూరు కారం' నిర్మాత నాగవంశీని తన ఎక్స్(ట్విటర్)ద్వారా అడిగేశాడు కూడా. 'గుంటూరు కారం రెండో పాట ఎప్పుడు విడుదల చేస్తున్నారు? ఇంతకీ అప్‌డేట్ ఎప్పుడు? మేం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం' అంటూ పోస్ట్ పెట్టాడు. దానికి నిర్మాత నాగవంశీ స్పందిస్తూ ' ఆ పనిలోనే ఉన్నాం నితిన్ స్వామి.. ఇంకో రెండు రోజుల్లో అద్భుతమైన వార్త చెబుతాం' అంటూ రీ పోస్ట్ పెట్టారు. ప్రొడ్యూసర్ నుంచి వచ్చిన ఈ అప్‌డేట్ మహేశ్ అభిమానులకు నిజంగా శుభవార్తే. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేశ్ నటిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. రెండురోజుల్లో రాబోతున్న సెకండ్ సింగిల్, పక్కా మాస్‌గా అభిమానులకు ఫుల్ కిక్క్ ఇచ్చేలా ఉంటుందని సమాచారం. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం విడుదల కానుంది. హారిక అండ్ హాసిని సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్నారు.


మానస చౌదరి, రోషన్ కనకాల

## ప్రేమ ప్రయాణంలో..

రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించారు. మానస చౌదరి కథానాయిక. మహేశ్వరి మూవీస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు నిర్మించాయి. ఈ చిత్రంలోని 'జాను' అనే మూడో గీతాన్ని ఈ నెల 6న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'హృదయాన్ని కదిలించే మెలోడీ ఇది. ప్రేమ ప్రయాణంలోని అందమైన భావనలకు అద్దం పడుతుంది. తప్పకుండా అందరికి నచ్చుతుంది' అని దర్శకుడు తెలిపారు. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు. హర్ష చెముడు, కిరణ్ మచ్చ, అనన్య ఆకుల, హర్షవర్ధన్, అనుహాసన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, సంగీతం: శ్రీచరణ్ పాకాల, ప్రొడక్షన్ డిజైనర్: శివమ్ రావు, రచన-దర్శకత్వం: రవికాంత్ పేరేపు.

## అదృష్టం మారిపోతుంది




'ఉప్పెన' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసింది కన్నడ సొగసరి కృతిశెట్టి. తొలి చిత్రంతోనే యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అయితే ఆ తర్వాత ఆశించిన విజయాలను దక్కించుకోలేదు. ప్రస్తుతం శర్వానంద్ సరసన ఓ చిత్రంలో నటిస్తున్నది. ఈ మధ్యకాలంలో తమిళ ఇండస్ట్రీపై ఎక్కువ దృష్టి పెట్టిన ఈ భామ అక్కడ జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తున్నది. దాదాపు వందకోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విశేషమేమిటంటే..పద్దెనిమిది భాషల్లో ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా చిత్రమిదని, ఒడిదుడుకులతో సాగుతున్న సినీ ప్రయాణాన్ని మలుపుతిప్పుతుందని కృతిశెట్టి ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నది. 'కెరీర్‌లోనే భారీ బడ్జెట్ చిత్రమిది. సినిమా కాన్సెప్ట్ కూడా చాలా కొత్తగా ఉంటుంది. నా క్యారెక్టర్‌లో భిన్న పార్శ్వాలుంటాయి' అని కృతిశెట్టి ఆనందం వ్యక్తం చేసింది. ఈ సినిమాలో ఈ భామతో పాటు కల్యాణి ప్రియదర్శన్, వామిక కబీ కథానాయికలుగా నటిస్తున్నారు.

## చివరి దశకు చేరుకున్న చిత్రీకరణ


రామ్‌చరణ్

మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా 'గేమ్‌ఛేంజర్'. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఈ సినిమా ఇంకా నిర్మాణంలోనే ఉండటం అభిమానుల్లో అసహనానికి దారి తీస్తూ వుంది. కమల్‌హాసన్‌తో శంకర్ తెరకెక్కిస్తున్న 'భారతీయుడు -2' చిత్రమే 'గేమ్‌ఛేంజర్' ఆలస్యానికి కారణమని ఫిలిం వర్గాల టాక్. అయితే ఎట్టకేలకు చరణ్ 'గేమ్‌ఛేంజర్' విషయంలో ఓ క్లారిటీ వచ్చింది. ఇటీవలే బెంగళూరులో 15రోజుల పాటు జరిగిన షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ 80శాతం పూర్తయిందని నిర్మాత దిల్ రాజు తెలియజేశారు. మిగతా షూటింగ్ కూడా పూర్తి చేసిన తర్వాత విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన అన్నారు. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రం సమకాలీన రాజకీయ ముఖచిత్రానికి అద్దం పట్టేలా ఉంటుందని తెలుస్తున్నది. కైరా అద్వాణీ, అంజలి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్.


నాని, మృణాల్ ఠాకూర్

## 'హాయ్ నాన్న' ఓ అద్భుతం

'దర్శకుడు శౌర్యువ్ భవిష్యత్తులో ఎన్ని సినిమాలను డైరెక్ట్ చేసినా.. 'హాయ్ నాన్న' మాత్రం అతనికి ప్రత్యేకమైన సినిమాగా నిలిచిపోతుంది. ఈ సినిమాకు పనిచేసిన అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. మృణాళ్ అద్భుతంగా నటించింది. ఈ సినిమా తర్వాత తనని అందరూ 'యష్ణ'గా గుర్తుపెట్టుకుంటారు. సాంకేతికంగా నెక్ట్స్ లెవల్ మూవీ ఇది.' అని హీరో నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. మృణాళ్ ఠాకూర్ కథానాయిక. బేబీ కియారా కీలక పాత్ర పోషించింది. ఈ చిత్రానికి దర్శకుడు శౌర్యువ్. నిర్మాతలు మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి. సెన్సార్ క్లీన్ యూ సర్టిఫికెట్ సొంతం చేసుకున్న ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఘనంగా 'హాయ్ నాన్న' సంగీత విభావరి నిర్వహించింది. భారీగా అభిమానులు పాల్గొన్న ఈ వేడుకలో కమల్‌హాసన్ 'గుణ' సినిమాలోని 'కమ్మనీ నీ ప్రేమలేఖలే రాసింది హృదయమే' అని సాగే ఇళయరాజా పాటను నాని ఆలపించి అందర్నీ ఆనందింపజేశాడు. మృణాళ్ ఠాకూర్ కూడా 'హాయ్ నాన్న' సినిమాలోని 'ఒడియమ్మా..'పాటకు నర్తించి, అందర్నీ అలరించింది. ఈ సినిమాలో నాని నటనకు అందరూ ప్రేమలో పడిపోతారని, సాంకేతికంగా ఈ సినిమా అద్భుతమని మృణాళ్‌ఠాకూర్ అన్నారు. 'హాయ్ నాన్న' లాంటి సినిమాలు అరుదుగా వస్తుంటాయని ప్రియదర్శి చెప్పారు. ఇంకా విరాజ్ అశ్విన్ కూడా మాట్లాడారు.

## అంత సామర్థ్యం నాకు లేదు


ప్రశాంత్‌నీల్

ఇటీవల విడుదలైన 'సలార్' ట్రైలర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. అయితే.. ఈ ట్రైలర్‌కి ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఎదురవ్వడం చర్చనీయాశంగా మారింది. ఈ ట్రైలర్‌ని చూసిన కొందరు క్రిటిక్స్.. సినేరియా మొత్తం 'కేజీఎఫ్' తరహాలోనే ఉందని, కథ కూడా దాదాపు అలాగే ఉందని, దీన్ని 'కేజీఎఫ్ 3' అనుకోవచ్చని కొన్ని విమర్శలు గుప్పించారు. దీనిపై దర్శకుడు ప్రశాంత్‌నీల్ వివరణ ఇచ్చారు. ' 'కేజీఎఫ్'కీ 'సలార్'కీ అస్సలు సంబంధం ఉండదు. 'కేజీఎఫ్', 'సలార్' రెండు విభిన్న ప్రపంచాలు. ఆ రెండు ప్రపంచాలను కలపాలని కోరుకోను. అంత సామర్థ్యం కూడా నాకు లేదు. ప్రభాస్ అంత తేలిగ్గా కథను ఒప్పుకోరు. ఒక హిట్ సినిమాను కాపీ చేయాల్సిన అవసరం ఆయనకు లేదు. ఆయన స్థాయి కూడా అది కాదు' అని తెలియజేశారు ప్రశాంత్ నీల్. ఈ నెల 21న 'సలార్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే.

## నీతోడు దొరకడం నా అదృష్టం


అలియాభట్

**'యానిమల్'** సినిమా చూసిన అలియాభట్‌కి ఆనందం అవధులు దాటింది. తన భర్త రణ్‌బీర్‌కపూర్ నటన చూసి పొంగిపోయింది అలియా. ఆ ఆనందాన్ని తన వ్యక్తిగత సోషల్‌మీడియా ద్వారా అందరితో పంచుకుంది.

'యానిమల్' చూశాను. ఆనందంతో మాట రావడంలేదు. వృత్తిపట్ల నీకున్న గౌరవం, ఇష్టం, ప్రేమ.. అన్నీ ఆ పాత్రలో కనిపించాయి. కెమెరా ఆన్‌లో ఉన్నా ఆఫ్‌లో ఉన్నా నువ్వు మాత్రం సూపర్ స్టారే. నటనను ఎంత ప్రేమిస్తావో.. కుటుంబాన్ని కూడా అంతే ప్రేమిస్తావు. నీతోడు దొరకడం నా అదృష్టం. ఈ రోజు మన పాప తొలి అడుగు వేసింది. ఓ వైపు నటుడిగా నువ్విచ్చిన ఆనందం, మరోవైపు తల్లిగా నా బిడ్డ ఇచ్చిన ఆనందం. నా జీవితంలో మరిచిపోలేని రోజు ఇది. అద్భుతాన్ని తెరపై ఆవిష్కరించిన సందీప్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నాను. కొన్ని రోజులు ఈ 'యానిమల్' జ్వరం అలా ఉండిపోతుంది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది అలియాభట్.


అజిత్

## వెట్రిమారన్ దర్శకత్వంలో..

సామాజిక సమస్యలను ఇతివృత్తాలుగా ఎంచుకొని సినిమాలు తీస్తూ విలక్షణ దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు వెట్రిమారన్. ఈ ఏడాది 'విడుతలై-1'తో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించే పనిలో ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం అజిత్ 64వ చిత్రానికి వెట్రిమారన్ దర్శకత్వం వహించనున్నారని తెలిసింది. ఈ సినిమాలో ఓ సోషల్ ఇష్యూని చర్చించబోతున్నారని, కథ నచ్చడంతో అజిత్ వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. ప్రస్తుతం అజిత్ 'విడాముయార్చి' చిత్రంలో నటిస్తున్నారు. మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయిక. ఇటీవలే దుబాయ్‌లో ఓ షెడ్యూల్ పూర్తిచేసుకుంది.


జాన్వీకపూర్

## సొంత ఇంటికి వచ్చినట్లుంది

కెరీర్ ఆరంభం నుంచి వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తున్నది జాన్వీకపూర్. బాలీవుడ్‌లో ఈ భామకు విజయాలు తక్కువే అయినా ఆమె పోషించిన పాత్రలకు మాత్రం మంచి మార్కులు పడ్డాయి. 'దేవర' చిత్రం ద్వారా ఈ భామ తెలుగు చిత్రసీమలోకి అరంగేట్రం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. దక్షిణాదిలో తొలి చిత్రమైన 'దేవర' తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమని జాన్వీకపూర్ ఆనందం వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'తెలుగు ఇండస్ట్రీ నాకెంతో ప్రత్యేకం. మా అమ్మకు ఇక్కడ లక్షల మంది అభిమానులున్నారు. అందుకే తెలుగు నేలతో నాకు అనుబంధం ఎక్కువ. హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తుంటే నా సొంత ఇంటికి వచ్చిన అనుభూతి కలుగుతున్నది. హిందీతో పాటు దక్షిణాదిలో మంచి విజయాలతో మా అమ్మ వారసత్వాన్ని కొనసాగిస్తాననే నమ్మకం ఉంది' అని చెప్పింది. ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'దేవర' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది.